# పునశ్చ

డా॥ సి.వి. కొండయ్య




**మళ్ళీ ఫోను మ్రోగింది. గుండె ఒక్కసారి ఝల్లుమనిపించి మళ్ళీ మామూలు స్థితికి చేరుకోటానికి కొన్ని సెకండ్లు పట్టింది. రాత్రి 11 దాటింది.**

ఫోన్ రాహుల్‌దే అయివుంటుంది. ఆ సమయంలో చేసేది అతనే. ఒకదాని ప్రక్క పూర్ణ విరామం వుంచిన తర్వాత, "పునశ్చ" లో మిగిలిపోయిందేదో మళ్ళీ చెప్పాలనే ఓపిక ఇప్పుడు గౌతమీకి లేదు. మంచి నిద్రను పాడు చేశాడని విసుక్కుంటూ గౌతమి రిసీవరు ఎత్తింది –

"హలో....!"

"హలో, గౌతమీ! నేను రాహుల్‌ను. ఐయామ్ సారీ, ఐ డిస్టర్బ్‌డ్ యు!"

"ఇట్స్ ఓ.కె. చెప్పండి!" అలసిన గొంతుతో అంది గౌతమి.

"నిన్న సాయంత్రం నీవు తీసుకున్న నిర్ణయానికి, "పునశ్చ" ఏమైనా ఉందేమో తెలుసుకోటానికి ఫోన్ చేశాను". గౌతమి నిశ్శబ్దంగా ఉండిపోయింది.

"చూడు గౌతమీ! నీవింకా టెన్షన్‌లో ఉన్నట్టు నీ మౌనం చెబుతోంది. నీవు నాకు కావాలి. నా ఇల్లు, నా సంపద, అంతా నీ చేతుల్లో ఉంచి నిశ్చింతగా నీ ఒడిలో నిదుర పోవాలని ఉంది. ఎంత ప్రయత్నించినా నీ జ్ఞాపకాల నుండి దూరం కాలేకపోతున్నాను. నీవు లేకుండా బ్రతకటం చాలా కష్టమనిపిస్తోంది. నీ చివరి నిర్ణయం గురించి మరొక సారి పునరాలోచించమని అడుగుతున్నాను. ప్లీజ్...!"

"యు హావ్ బికమ్ ఎ పార్ట్ ఆఫ్ మై లైఫ్ సిస్టమ్!" జవాబివ్వకపోయినా రాహుల్ చెబుతూనే ఉన్నాడు.

"నేను ఉద్యోగం చేసినా ఫర్వాలేదా?" మామూలుగానే అడిగింది గౌతమి – "చూడు రాహుల్! నా పరిస్థితి కూడా నీలాగే ఉంది. పెళ్ళి, కుటుంబం, ఇల్లు, పిల్లలు – నాకన్నీ కావాలి. వెంటనే కావాలి. ఆలస్యం అమృతం విషం కాకముందే, జరిగిపోవాలి. వయసు ఎవరికోసం ఆగదు. అది నీకు కూడా బాగా తెలుసు..." అంటూ ఆగింది గౌతమి.

"ఐతే అన్నీ వదిలి వచ్చేసెయ్ గౌతమీ! నేను ప్రతిక్షణం నీకోసమే వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నాను. మనం వెంటనే పెళ్ళి చేసుకుందాం".

"నా కభ్యంతరం లేదు రాహుల్! కానీ నాకు కొంత వ్యవధి కావాలి. మా ఇల్లు, మావాళ్ళూ, చుట్టూ నావనిపించే పరిసరాలు, అన్నీ తెగతెంపులు చేసుకుని వెంటనే రాలేను. పెళ్ళి అయ్యాక, నీవు కోరుకున్నట్టుగా నా ఉద్యోగం, బిజినెస్ కూడా వదులుకుంటాను. కానీ వెంటనే కాదు. ఎన్నో సంవత్సరాల సుదీర్ఘ ఘర్షణతో అలవాటు పడ్డ ఈ వాతావరణం నుండి బయటపడటానికి కొంత వ్యవధి పడుతుంది. అదే నిన్ను నేను అడుగుతున్నది".

"నీవు వెంటనే నిర్ణయించుకోవాలి. నేనా, నీవాళ్ళా?"

"నేనూ నిన్ను అదే ప్రశ్న అడిగితే?"

"అంటే...?"

"నీ బిజినెస్‌ను స్టాప్ చేసి నా దగ్గరకు రాగలవా?"

"నేను మగాడినన్న విషయం నీవు మరచిపోతున్నావు. తెల్లారేలోగా ఏదో ఒకటి తేల్చి చెప్పేసెయ్! ఉదయమే నాకు ఓ మీటింగ్ ఉంది!"

"నాకు కూడా ఆఫీసు ఉంది!" అన్నది గౌతమి.

"అదే నేను అసహ్యించుకునేది. నీవు ఉద్యోగం చేయటం నాకెంతమాత్రమూ ఇష్టం లేదు. నీవు కేవలం నాకోసమే కావాలి. బిజినెస్ కోసం నీ సమయం పంపకం కావటం నేను భరించలేను. నీవెప్పుడూ నాకోసమే అవైలబుల్‌గా ఉండాలి. అండర్‌స్టాండ్?" రాహుల్ కంఠంలో పురుషాధిక్యత స్పష్టంగా అగుపించింది.

"నాకు కొంత వ్యవధి కావాలి రాహుల్! నన్ను అర్థం చేసుకోటానికి ప్రయత్నించు...!" అంటూ బ్రతిమలాడే కంఠంతో అడిగింది గౌతమి...

ఇదేమాట 5 సంవత్సరాల క్రితం దేవదత్తును గౌతమీ అడిగింది. కానీ దేవదత్తు కూడా గౌతమీ మాట వినలేదు. 5 సంవత్సరాల సుదీర్ఘ ప్రేమను ఒక్క క్షణపు ఆవేశంలో సమూలంగా త్రెంచుకుని వెళ్ళిపోయినవాడు మళ్ళీ తిరిగి రాలేదు. ఎటువంటి పలకరింపూ లేదు. ఆ షాక్ నుండి తట్టుకోటానికే రాహుల్‌ను తన జీవితంలోకి ఆహ్వానించింది గౌతమి. ఇతనూ దేవదత్తులాంటి వాడే అయ్యాడు.

"ఐ యామ్ సారీ దేవదా!" అంది గౌతమి. వెంటనే నాలుక కరుచుకుంది.

"ఓహో! ఇంకా ఆ దద్దమ్మను మరచిపోలేదన్నమాట. ఛీ..ఛీ! మీ ఆడజాతిని నమ్ముకోవటమే బుద్ధి తక్కువ. గో టు హెల్ విత్ దట్ బాస్టర్డ్!" అంటూ రాహుల్ ఫోన్ పెట్టేశాడు.

రిసీవరు పెట్టేసిన గౌతమి అలాగే కూర్చుండిపోయింది చాలాసేపు. సమయమెంతయిందో గమనించలేదు.

రేపు ఏం చేయాలో ఆలోచించుకుంటూ బెడ్ మీద మేను వాల్చింది గౌతమి. ఒక చేత్తో వేడి కన్నీటిని తుడుచుకుంటూ దీపం ఆర్పి వేసింది.